

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి

శనివారం

14 అక్టోబర్ 2026



సమాజాన్ని మేల్కొలిపే దిశగా జిల్లా రచయితల సంఘం



సూర్యాపేట (జనంసాక్షి) : సమాజంలో జరుగుతున్న పరిణామాలను అక్షరాల రూపంలో ప్రజలకు చేరవేస్తూ, ప్రజల్లో చైతన్యం కలిగించడమే లక్ష్యంగా సూర్యాపేట జిల్లా రచయితల సంఘం ముందుకు సాగుతోందని జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పెద్దిరెడ్డి గణేష్ తెలిపారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని సుధా బ్యాంకులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ హుజూర్‌నగర్, కోదాడ, తుంగతుర్తి, సూర్యాపేట నాలుగు తాలూకాల్లో రచయితల సంఘాలను ఏర్పాటు చేసి, జిల్లా స్థాయిలో కవులు, రచయితలను ఒకే వేదికపైకి తీసుకురావడం జరిగిందన్నారు.ఈ నెల 15న జిల్లా కేంద్రంలోని త్రివేణి ఫంక్షన్ హాల్ లో అభినందన సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ సభకు జిల్లాలోని కవులు, రచయితలు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొంటారన్నారని చెప్పారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న రచయితల ప్రతిభను వెలికితీసి, వారందరినీ ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు నడిపించాలన్నది సంఘం ప్రధాన ఉద్దేశమన్నారు.సమాజహితమైన కథలు, కవిత్వం, సాహిత్య రచనల ద్వారా ప్రజలకు అవసరమైన సమాచారాన్ని అందించడంతో పాటు, సమాజంలో చోటుచేసుకుంటున్న అన్యాయాలు, సమస్యలపై అక్షరాలతో స్పందిస్తామని పేర్కొన్నారు.రచయితలు ఏ రాజకీయ పక్షానికో కాకుండా ప్రజల పక్షాన నిలబడి తమ కలాలతో పోరాడాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.సమాజాన్ని మంచి మార్గంలో నడిపించడం, ప్రజల్లో చైతన్యం, సామాజిక స్పృహ కలిగించడం, ప్రజలను మేల్కొలపడం జిల్లా రచయితల సంఘం ప్రధాన లక్ష్యాలని వివరించారు.సమావేశాలు, సాహిత్య కార్యక్రమాలు, రచనల ద్వారా ప్రజలకు చేరువవుతామని చెప్పారు.ప్రతి తాలూకాలో ప్రజాస్వామ్య పద్ధతిలో రచయితల సంఘాలను ఏర్పాటు చేసి, వాటిని జిల్లా సంఘంగా సమన్వయం చేయడం ద్వారా సూర్యాపేట జిల్లా రెండు తెలుగు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచే ప్రయత్నం చేస్తోందన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రజా వాగ్గేయ కారుడు గోరటి వెంకన్న, అధ్యక్షులుగా మహదేవ్ వ్యవహరించనుండగా, సీనియర్ జర్నలిస్టు, ఈనాడు మాజీ ఎడిటర్ తాడి ప్రకాష్, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు ప్రసేన్, తిరుపతికి చెందిన సప్తగిరి లిటరరీ ప్రతినిధి శ్రీశైలకుమార్ తదితర ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు.సూర్యాపేట మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది జ్యోతి ప్రజ్వలన చేస్తారు. పెద్దిరెడ్డి రాజా, వై.వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్, బెజవాడ వెంకటేశ్వర్లు, షఫీ ఉల్లా తదితర నాయకులు ఇంకా సాహితీవేత్తలు పాల్గొననున్నారని తెలిపారు.ఈ సమావేశం లో మనం వికాస వేదిక సభ్యులు గెల్లి అంజన్ ప్రసాద్,వీరయ్య చిట్టిపాక, కక్కిరేణి చంద్ర శేఖర్, బోనగిరి భాస్కర్,తోట శ్యాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల రేషన్ బియ్యం పక్కదారి?

50 కిలోలు పట్టివేత



కొత్తగూడెం క్రైమ్, నవంబర్13 (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతున్న ఘటన వెలుగులోకి వచ్చింది. పాల్వంచ వర్తక సంఘం భవనం పక్కన గల రేషన్ షాపు నెంబర్ 3016026 నుండి కిలో 20 రూపాయల చొప్పున అమ్ముతూ 50 కిలోల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పేదలకు చెందాల్సిన బియ్యాన్ని బహిరంగ మార్కెట్లో అమ్ముతున్నారన్న సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఇలా పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న షాపును రద్దు చేయాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కామన్ స్కూల్ విద్యా విధానంతోనే సామాజిక మార్పు



ఖమ్మం, (జనంసాక్షి) : కామన్ స్కూల్ విద్యా విధానంతోనే సామాజిక సమానత్వం వస్తుందని టిపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి విజయ్ అన్నారు. శుక్రవారం ఖమ్మం పట్టణం రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఖమ్మం డివిజన్ నిర్మాణ జనరల్ బాడీ సమావేశం స్టాలిన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి విజయ్ మాట్లాడుతూ అసమానతలు లేని సమ సమాజం నిర్మాణం కావాలంటే అసమానతలు లేని ఉచిత విద్యా విధానం అమలు చేయాలని ఆయన అన్నారు. నేడు పాలకులే దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తూ ప్రైవేటీకరణ,గ్లోబలైజేషన్ వైపు విద్యను మళ్లిస్తున్నారని దీని మూలంగా విద్యా వ్యాపారం పెరిగి ప్రభుత్వ విద్య కనుమరుగవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పిఓడబ్ల్యూ రాష్ట్ర కోశాధికారి ఝాన్సీ, పి డి యస్ యూ ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శి తిమ్మిడి.రఘుబాబు తిప్పారపు.లక్ష్మణ్ మాట్లాడుతూ శాస్త్రీయ విద్యా సాధన కోసం అమరులైన జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి,కోలా శంకర్,దస్సా చేరారు, రంగవల్లి,స్నేహలత లు విలువైన ప్రాణాలను పణంగా పెట్టి పేద విద్యార్థుల కోసం రక్త తర్పణ చేశారని వారి స్ఫూర్తితో విద్యార్థి ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జనరల్ బాడీ సమావేశంలలో ఖమ్మం డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నూతన డివిజన్ కమిటీ ఎన్నిక

అధ్యక్షులు కార్తీక్ రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి పాండవుల సుశాంత్, సహాయ కార్యదర్శి స్టాలిన్, కోశాధికారి మనోజ్, కమిటీ సభ్యులుగా చిట్టిబాబు, శ్రీనాథ్, సిద్దు, బాలు, చరణ్, అభిలాష్, ప్రవీణ్ ,గణేష్ తో పాటు మరో రెండు కో- ఆప్షన్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జాతీయస్థాయి కథల పోటీలో వెలుగుపల్లి విద్యార్థుల ప్రతిభ





తుంగతుర్తి, నవంబర్ 13 (జనంసాక్షి) : తెలంగాణ సారస్వత పరిషత్ వారు 2026 బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జాతీయ స్థాయి కథల పోటీలో వెలుగుపల్లి పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పరిషత్ చైర్మన్ ఆచార్య ఎల్లూరి శివారెడ్డి , కార్యదర్శి డా.జుర్రు చెన్నయ్య, కార్యవర్గ సభ్యులు గరిపల్లి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు , పాఠశాలకు చెందిన ఏడవ తరగతి విద్యార్థి రెడ్డి మల్ల యశ్వంత్ రాసిన రైతుల కష్టాలు,పి సాత్విక రాసిన మాయా కుక్కపిల్ల కథలు జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు, సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొడుగు అబ్బయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు యశ్వంతును, గైడ్ టీచరుగా వ్యవహరించిన తెలుగు ఉపాధ్యాయులు శీల అవిలేనును అభినందించారు. ఈనెల 22న తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాదులో బహుమతి ప్రధానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి

ప్రైవేట్ వ్యాపారుల సిండికెట్ దోపిడీకి అడ్డుకట్ట వేయాలి : సీపీఐ (ఎం)



ఖమ్మం, నవంబర్ 13, (జనంసాక్షి) : ప్రైవేట్ వ్యాపారులు, మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి ఇష్టారాజ్యంగా వరి ధాన్యం ధరలు తగ్గిస్తూ సాగిస్తున్న దోపిడీకి తక్షణమే అడ్డుకట్ట వేసి, జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కనీస మద్దతు ధరకే కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు, సీపీఐ (ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. రైతుల వద్ద ధాన్యం ఉన్నప్పుడే కొనుగోలు చేయకుండా ఆలస్యం చేసి, ఆ తర్వాత కొనుగోలు చేస్తే రైతులకు కలిగే ప్రయోజనం ఏమిటని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. రైతుల దయనీయ పరిస్థితిని ప్రభుత్వం తక్షణమే గమనించాలని, ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం వల్ల పండించిన ధాన్యం మార్కెట్‌కు వస్తున్నప్పటికీ రైతులకు మద్దతు ధర దక్కే అవకాశం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మొదట్లో ప్రైవేట్ వ్యాపారులు కొంత ఎక్కువ ధర పెట్టి కొనుగోలు చేసినప్పటికీ, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడాన్ని ఆసరాగా చేసుకుని మిల్లర్లు అందరూ కలిసి సిండికేట్ అయి ధరలను భారీగా తగ్గించేశారని నున్నా నాగేశ్వరరావు ఆరోపించారు.



రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు

కనగల్లు, నవంబర్ 13 (జనంసాక్షి) : ఈ నెల 13, 14,15, తేదీలలో రంగారెడ్డి జిల్లా తూముకుంట గ్రామంలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండల కేంద్రంలోని శ్రీ అక్కెనపల్లి వెంకట శ్రీనివాసరావు మెమోరియల్ పాఠశాల (మోడల్ స్కూల్) నుంచి బాలికల జట్టు తరఫున తాటికొండ పల్లవి బాలుర జట్టు తరఫున కే చందు ఎస్ జి ఎఫ్ వి అండర్ 17 లకు ఎంపికై ఆటల పోటీలలో పాల్గొనున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ థామస్ తెలిపారు. పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి పోటీలలో ఆడటానికి వెళుతున్న వీరిని పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

అఖిల భారత అండర్ - 19 ఫుట్బాల్ పోటీలకు ఖమ్మం జిల్లా విద్యార్థి

డిసెంబర్ 10న అండమాన్ లో తెలంగాణ తరపున ఆడనున్న వి.వి.పాలెం బాలుడు

ఆర్థిక చేయూత కోసం తండ్రి వేడుకోలు



ఖమ్మం అర్బన్, (జనంసాక్షి) : నిరుపేద కుటుంబంలో పుట్టి పెరిగిన విద్యార్థి మన తెలంగాణ రాష్ట్రం తరపున జాతీయ స్థాయి ఫుట్బాల్ పోటీల్లో ఆడేందుకు సిద్ధమయ్యాడు. తండ్రి లారీ డ్రైవర్ గా పని చేస్తుండగా చిన్న నాటి నుంచి క్రీడలపై మక్కువ ఉన్న ఆ విద్యార్థి తాజాగా జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ఆడే అవకాశం దక్కించుకోవడం విశేషం. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన చేబ్రోలు శివ కృష్ణ పెద్ద కుమారుడు చెన్నకేశవ ప్రస్తుతం ఖమ్మంలోని ఎస్ ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో చదువుతున్నాడు. కాగా ఇప్పటికే జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో పాల్గొని రాణించిన ఆ విద్యార్థి ఇటీవల ఎస్జీఎఫ్ తెలంగాణ రాష్ట్ర అండర్-19 ఫుట్బాల్ జట్టుకు ఎంపికయ్యాడు. దీంతో మన రాష్ట్రం తరపున జాతీయ స్థాయి ఫుట్బాల్ పోటీల్లో ఆడే ఛాన్స్ దక్కించుకున్నాడు. వచ్చే నెల అంటే డిసెంబర్ 10వ తేదీన అండమాన్ నికోబార్ లో జరగనున్న అఖిల భారత ఎస్జీఎఫ్ అండర్ - 19 ఫుట్బాల్ ఛాంపియన్షిప్లో చెన్నకేశవ తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనుండటం గర్వకారణం. ఒక చిన్న కుగ్రామంలో సాధారణ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి అఖిల భారత ఫుట్బాల్ పోటీల్లో ఆడేందుకు వెళుతుండటం పట్ల విద్యార్థి సొంత గ్రామ ప్రజలతో పాటు జిల్లా స్థాయి ఫుట్బాల్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇందుకు మొత్తం రూ.31,000 చెల్లించాల్సి రావడంతో ఆ విద్యార్థి తండ్రి ఆర్థిక స్థోమత ఇందుకు సహకరించని పరిస్థితి నెలకొంది. దీంతో తండ్రి శివ కృష్ణ క్రీడా ప్రోత్సాహకుల చేయూత కోసం అర్థిస్తున్నాడు. తమకు తోచిన సాయాన్ని 8179582890 ఈ నెంబర్ కు ఫోన్ పే రూపంలో అందించాలని అభ్యర్థిస్తున్నాడు.

తీన్మార్ మల్లన్న పాదయాత్రపై లారీ దూసుకొచ్చిన ఘటనపై టీఆర్పీ ఆగ్రహం

బహుజన నాయకుడి ప్రాణాలకే ముప్పు తెచ్చిన దాడి.. దీని వెనుక ఎంతటి వారున్నా వదలొద్దు

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుంటే ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి : టీఆర్పీ ఖమ్మం జిల్లా నేతల డిమాండ్



ఖమ్మం టౌన్ నవంబర్ 13, (జనంసాక్షి) : బహుజనుల హక్కుల సాధన కోసం, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ప్రజల్లోకి వెళ్లి పాదయాత్ర చేస్తున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాదయాత్రపై లారీ దూసుకొచ్చిన ఘటన తీవ్ర కలకలం రేపింది. మోత్కూరు సమీపంలోని మాలగిరి ప్రాంతంలో పాదయాత్ర సాగుతుండగా వేగంగా వచ్చిన లారీ పాదయాత్రలోని వాహనాన్ని, కారును ఢీకొట్టడంతో ఐదారుగురు తీవ్రంగా గాయపడినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ ఘటనను తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఖమ్మం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జ్ గట్ల రాజన్న, జిల్లా అధ్యక్షుడు దామల సత్యం మాట్లాడుతూ.. ఒక బహుజన బిడ్డగా అట్టడుగు, బడుగు, బలహీన వర్గాల ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ, వారి సమస్యలను వెలుగులోకి తెచ్చేందుకు ప్రజా పాదయాత్ర చేస్తున్న తీన్మార్ మల్లన్న యాత్రలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సాధారణ ప్రమాదమా? లేక దీని వెనుక ఏదైనా కుట్ర దాగి ఉందా? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటన వెనుక ఎంతటి పెద్ద వ్యక్తులు ఉన్నా, ఏ రాజకీయ శక్తుల ప్రమేయం ఉన్నా ప్రభుత్వం నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న బహుజన నాయకులకే భద్రత లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ శ్రేణుల్లో ఈ ఘటన తీవ్ర ఆందోళనకు కారణమైందన్నారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను, ప్రజా పోరాటాలను భౌతిక దాడులతో అణచివేయాలనుకోవడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ ఘటనపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ప్రత్యేక దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఈ ఘటనపై నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జ్ గట్ల రాజన్న, జిల్లా అధ్యక్షుడు దామల సత్యం, జిల్లా ఉపాధ్యక్షులు పెరమలపల్లి నాగార్జున, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు తేలపుట్ట జగపతి, టౌన్ అధ్యక్షుడు కొప్పుల రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలోజు వినయ్, టౌన్ ప్రధాన కార్యదర్శి కేతవరపు లెనిన్ పాల్గొన్నారు. అలాగే మానవ హక్కుల పరిరక్షణ సమితి చైర్మన్ చలమల హైమావతి, కిరణ్మయి, అనిత, సాయి, సైదులు, చారి తదితరులు ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా పలువురు నూతనంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు.



బీజేపీ రూరల్ ఓబీసీ మండల అధ్యక్షుడిగా మాకోలు లింగం యాదవ్

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 13 (జనం సాక్షి): భారతీయ జనతా పార్టీ భూదాన్ పోచంపల్లి మండల రూరల్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా మాకోలు లింగం యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల అధ్యక్షుడు మేకల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ నూతన అధ్యక్షుడు మాకోలు లింగం యాదవ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాకోలు లింగం యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని, పార్టీ అభివృద్ధికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

చింతకాని మండలంలో పలు గ్రామాల్లో లింగాల కమల్ రాజు పర్యటన



చింతకాని, నవంబర్ 13 (జనం సాక్షి): ఖమ్మం జిల్లా మాజీ జడ్పీ చైర్మన్, మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ లింగాల కమల్ రాజు శుక్రవారం చింతకాని మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ప్రొద్దుటూరులో నిర్వహించిన అయ్యప్ప స్వాముల బిక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కోమట్లగూడెంలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ సర్పంచ్ వేముల నర్సయ్య, సత్యనారాయణరెడ్డిలను పరామర్శించారు. బస్వాపురంలో ఇటీవల మృతి చెందిన దొడ్డ బసవయ్య, మాజీ సర్పంచ్ ఆవుల ఆదెమ్మ, వరికూటి నరసింహారావు, చంద్రకాని గోవిందరావుల చిత్రపటాలకు నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పందిళ్లపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న లింగం శ్రీనివాసరావు, వత్సవాయి నాగలక్ష్మిలను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఉపసర్పంచులు, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కిడ్నీ బాధితురాలికి శ్రీ నృసింహ సేవా వాహిని ఆర్థిక చేయూత

వైద్య చికిత్స కోసం రూ.15 వేల సాయం అందజేత

భద్రాచలం నవంబర్ 13 (జనంసాక్షి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా : కిడ్నీ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న భద్రాచలానికి చెందిన అర్జునపూడి నవతకు శ్రీ నృసింహ సేవా వాహిని ఆర్థిక చేయూత అందించింది. ఆమె వైద్య చికిత్స నిమిత్తం రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకుంది. శ్రీ గోవింద కల్పవృక్ష నారసింహ సాలగ్రామ ఆశ్రమ వ్యవస్థాపకులు కృష్ణ చైతన్య స్వామి ఆధ్వర్యంలో శ్రీ నృసింహ సేవా వాహిని ద్వారా ఈ ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ యువ నాయకులు కుంజా సంతోష్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నృసింహ స్వామి భక్తులకు ఆధ్యాత్మిక సేవలు అందించడంతో పాటు, సామాజిక మాధ్యమాల ద్వారా సమకాలీన ధర్మ సందేహాలకు సమాధానాలు అందిస్తున్న కృష్ణ చైతన్య స్వామి సేవలు అభినందనీయమన్నారు. మానవసేవే మాధవ సేవ అనే ధర్మాన్ని ఆచరణలో చూపిస్తూ అనారోగ్యంతో బాధపడుతున్న నవతకు ఆర్థిక సాయం అందించడం గొప్ప విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే భద్రాచలం పట్టణ అధ్యక్షులు విజ్జగిరి రాజా కిరణ్, హరిబాబు, సాయి కౌశిక్, రాజేష్, శేఖర్, డిపో యూత్ సభ్యులు పండా అమృతరావు (అంబు), తాళ్ల నాగరాజు, శీలం నాగరాజు, సవలం వంశీ, తాళ్ల శివ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర వసతి గృహాల్లో డిప్యూటీ డైరెక్టర్ ఆకస్మిక తనిఖీ



ఖమ్మం, (జనంసాక్షి) : షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఖమ్మం జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి గుడికందుల జ్యోతి గారు ఈరోజు సాయంత్రం ఖమ్మం నగరంలోని ఎస్సీ బాలుర వసతి గృహం(బి), ఎస్సీ బాలుర వసతి గృహం ఆనంద నిలయం, ఎస్సీ బాలుర వసతి గృహం(సి) లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన ఖీ=ూూ (ఫేషియల్ రికగ్నేషన్ అటెండెన్స్ సిస్టం) అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులకు గ్రూపుల వారీగా ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా హాజరు ఏ విధంగా నమోదు చేస్తున్నారో, ఈ విధానం అమలు జరుగుతున్న తీరును సంబంధిత హాస్టల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసతి గృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజన సదుపాయాలను, స్టోర్ రూమ్‌లోని సరుకుల నిల్వలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి వారి చదువులు, విద్యా ప్రగతి, పరీక్షలకు చేస్తున్న సన్నద్ధత గురించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు బోధన అందించేందుకు వచ్చిన ట్యూటర్‌తో కూడా మాట్లాడి బోధనా కార్యక్రమాల నిర్వహణపై ఆరా తీశారు. ఈ తనిఖీల్లో సహాయ సంక్షేమ అధికారులు ఎం.డి. అబ్దుల్ రావుఫ్, యం.వీరయ్య, గోపీచంద్ నాయక్, వసతి గృహ సంక్షేమ అధికారులు కోటపాటి రుక్మారావు, యన్.రమేష్ తదితరులతో పాటు నాలుగో తరగతి సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుండి నేత్రపర్వంగా అయ్యప్ప స్వామి ప్రతిష్ఠా మహోత్సవం వేడుకలు

ఐదురోజుల పాటు ఆధ్యాత్మిక శోభ

భక్తులు భారీ సంఖ్యలో తరలిరావాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు పిలుపు



చండూరు, నవంబర్ 13 (జనంసాక్షి) : నల్లగొండ జిల్లా చండూరు పట్టణంలోని అయ్యప్ప నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. నవంబర్ 14వ తేదీ శనివారం నుండి 18వ తేదీ బుధవారం వరకు ఐదు రోజుల పాటు ఈ వేడుకలు అత్యంత వైభవోపేతంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలను ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షులు, చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మీడియాకు వెల్లడించారు. ఈ నెల 14, 15, 16 తేదీలలో ఆలయ ప్రాంగణంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, హోమాలు, అయ్యప్ప స్వామి వారి ప్రాణ ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మూడు రోజుల పాటు భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ నెల 18వ తేదీ సాయంత్రం 6:30 గంటలకు విశేషమైన 'పడిపూజ' కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. మహోత్సవానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయ ప్రతిష్ఠోత్సవం జరగడం చండూరు ప్రజలందరికీ గర్వకారణమని డాక్టర్ కోడి శ్రీనివాసులు పేర్కొన్నారు. సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఆలయంలో జరిగే ఈ ఆధ్యాత్మిక వేడుకలకు గురుస్వాములు, మాలధారణ భక్తులు, మహిళలు, ప్రముఖులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహక కమిటీ కోరింది.

రైతుల సమక్షంలో పారదర్శకంగా భూ రీ సర్వే నిర్వహించాలి

భూ సమస్యల పరిష్కారమే రీ సర్వే ప్రధాన లక్ష్యం : ఆర్డీఓ శ్రీదేవి



చండూరు, నవంబర్ 13 (జనంసాక్షి) : భూ రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి తప్పులకు తావులేకుండా నిర్వహించాలని చండూరు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) శ్రీదేవి అధికారులకు సూచించారు. భూముల సరిహద్దులు, విస్తీర్ణం తదితర వివరాలను శాస్త్రీయ పద్ధతిలో కచ్చితంగా నమోదు చేయడం ద్వారా భవిష్యత్తులో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.చండూరు మండలంలోని కుమ్మందానిగూడెం గ్రామంలో భూ రీ సర్వే నేపథ్యంలో ఆర్డీఓ శ్రీదేవి, తహశీల్దార్, డీఐవోఎస్, మండల సర్వేయర్, గిర్దావర్లు, జీపీవోలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి రీ సర్వే విధానం, భూముల హద్దులు, రెవెన్యూ రికార్డుల వివరాలపై చర్చించారు.రైతులు తమ భూములకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులకు అందించాలని, సర్వే సమయంలో క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి సహకరించాలని సూచించారు. భూముల వివరాల నమోదులో ఏవైనా తేడాలు లేదా అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేస్తూ రీ సర్వే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు.భూ రికార్డుల్లో పారదర్శకత, భూ యజమానులకు స్పష్టమైన హక్కులు కల్పించడం, భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా చూడటమే ఈ సమగ్ర భూ రీ సర్వే ముఖ్య ఉద్దేశమని ఆర్డీఓ వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల సత్వర పరిష్కారానికే ప్రత్యేక వర్క్‌షాప్‌లు

అకౌంటెంట్ జనరల్ వి.ఎం.వి. నావల్ కిషోర్

రిటైర్డ్ ఉద్యోగుల పట్ల గౌరవంగా వ్యవహరించాలి: అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి

కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా పెన్షన్, జీపీఎఫ్ అదాలత్



ఖమ్మం, నవంబర్ 13 (జనంసాక్షి): ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్, జీపీఎఫ్ (GPF), ఇతర సర్వీస్ సంబంధిత సమస్యలను అక్కడికక్కడే సత్వరమే పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నట్లు అకౌంటెంట్ జనరల్ (ఏజీ) వి.ఎం.వి. నావల్ కిషోర్ తెలిపారు. శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ మరియు అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అకౌంటెంట్ జనరల్‌తో పాటు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏజీ నావల్ కిషోర్ మాట్లాడుతూ.. ట్రెజరీ శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఫైనాన్షియల్ అకౌంట్లు, పెన్షన్, జీపీఎఫ్ ఆమోదించబడతాయని, ఇందుకు సంబంధించి డీడీవో (ణఱూ) కార్యాలయాల నుండి వచ్చే ప్రతిపాదనలు కచ్చితత్వంతో, సకాలంలో ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల (జీవోల) విషయంలో వివిధ కార్యాలయాలు వేర్వేరుగా అర్థం చేసుకోవడం (ఇంటర్‌ప్రిటేషన్) వల్ల జాప్యం జరుగుతోందని, ఆయా నిబంధనలపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేసేందుకే ఈ వర్క్‌షాప్ ప్రారంభించామన్నారు. ట్రెజరీల పనితీరు మెరుగుదలకు ఆడిట్, తనిఖీలు కీలకమని, లోపాలను సరిదిద్దుకుంటే ఖాతాల నిర్వహణ మరింత పారదర్శకంగా మారుతుందని చెప్పారు. భవిష్యత్తులో మనమందరం పెన్షనర్లుగా మారతామనే విషయాన్ని గుర్తుంచుకుని, వారి కోసం ఒక మెరుగైన వ్యవస్థను రూపొందించాలని పిలుపునిచ్చారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. 30 నుండి 40 ఏళ్ల పాటు ప్రభుత్వానికి సుదీర్ఘ సేవలందించి పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పట్ల పూర్తి గౌరవంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. పదవిలో ఉన్నప్పుడు ఇచ్చిన గౌరవాన్నే రిటైర్మెంట్ తర్వాత కూడా ఇస్తూ, వారిని చిన్నచూపు చూడకుండా సానుకూల దృక్పథంతో సమస్యలను పరిష్కరించాలన్నారు. చిన్న చిన్న కారణాలతో ఉత్తర ప్రత్యుత్తరాలు (కరస్పాండెన్స్) నడుపుతూ రిటైర్డ్ ఉద్యోగులను ఆఫీసుల చుట్టూ తిప్పకుండా, ఇలాంటి ఉమ్మడి వర్క్‌షాప్‌ల ద్వారా అక్కడికక్కడే పరిష్కారం చూపడం వల్ల సమయం ఆదా అవుతుందన్నారు. బిల్లుల ఆమోద ప్రక్రియ, పాలసీ అంశాలపై డీడీవోలు పూర్తి అవగాహన పెంచుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్స్ ఎం. నరేష్ కుమార్, కె. శశిధర్, ఖమ్మం ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ వై. శ్రీనివాస రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ జె. మీనాక్షి, ఖమ్మం పీఏవో రామ్, ఉభయ జిల్లాల వివిధ శాఖల అధికారులు, ఉప కోశాధికారులు మోదుగు వేలాద్రి, ప్రసన్న కుమార్, నాగేంద్ర కుమారి, శారద, రఫియా సుల్తానా, కృష్ణారావు, సారధి, సునీల్, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, సైదులు, ఖజానా శాఖ సిబ్బంది పాల్గొన్నారు

హుజూర్ నగర్‌లో ఘనంగా నాగుల చవితి వేడుకలు



హుజూర్‌నగర్ నవంబర్ 13 (జనంసాక్షి): పట్టణంలో శుక్రవారం నాగుల చవితి పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా పూజలు నిర్వహించారు. కార్తీక మాసం శుక్ల పక్ష చవితి రోజున ఈ పండుగను జరుపుకుంటారు. నాగదేవతను పూజిస్తే సంతాన దోషాలు కాలసర్ప దోషాలు తొలగిపోతాయని సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే మహిళలు, పిల్లలు, భక్తులు పెద్ద సంఖ్యలో పట్టణంలోని నాగమయ్య గుడి ఎదుట బారులు తీరారు. నాగదేవతల విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి పసుపు, కుంకుమ సమర్పించి భక్తితో పుట్టలో పాలు పోసి, చలిమిడి, వడపప్పు, అరటిపండ్లు తదితర నైవేద్యాలను సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. తమ కుటుంబంలో సంతాన భాగ్యం కలగాలని, పిల్లలకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షుతో, కుటుంబమంతా, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మహిళలు నాగదేవతలను వేడుకున్నారు. భక్తుల రద్దీతో పూజా కార్యక్రమాలతో గుడి ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నాగమయ్య గుడి పరిసరాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ముందస్తు బాలల దినోత్సవ వేడుకల్లో చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్ సందడి

విభిన్న వేషధారణలతో ఆకట్టుకున్న త్రివేణి విద్యార్థులు



ఖమ్మం, (జనంసాక్షి) : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మంలోని త్రివేణి పాఠశాలలో చిన్నారుల కోసం ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు రైతులు, పెళ్లికూతురు, ఏంజెల్స్, డైనోసార్లు, కోడిపుంజు, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, భారతమాత తదితర విభిన్న పాత్రల్లో రంగురంగుల వేషధారణలతో అలరించారు. తమ పాత్రలకు అనుగుణంగా హావభావాలు, సంభాషణలతో ప్రదర్శనలు ఇస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ బాలలే దేశ భవిష్యత్తు అని, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విద్యతో పాటు కళలు, సంస్కృతి, ఆత్మవిశ్వాసం, భావవ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. చిన్నారుల వేషధారణలు, ప్రదర్శనలు ప్రశంసనీయమని అభినందించారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించకుంటే కలెక్టరేట్ ముట్టడిస్తాం



పలిగొండ, నవంబర్ 13 (జనంసాక్షి) : మండలంలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో రైతు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పాశం భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్రాలు ప్రారంభించి కొబ్బరికాయలు కొట్టి, రిబ్బన్లు కట్ చేయడమే తప్ప ధాన్యం కొనుగోళ్లు చేపట్టడం లేదని విమర్శించారు. దీంతో రైతులు దళారులకు తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. వెంటనే కొనుగోళ్లు ప్రారంభించకుంటే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు పకీర్ రాజేందర్ రెడ్డి, జిల్లా కిసాన్ మోచ కార్యదర్శి కందుల తానేష్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మైసోల్ల రామ నర్సు, జిల్లా నాయకులు బండారపు రాములు, సిలోజు శ్రీరాములు, బచ్చ శ్రీనివాస్, మైసోల్ల మత్స్యగిరి, ఎలిమినేటి వెంకటేష్, స్థానిక వార్డ్ మెంబర్ దంతూరి అరుణ్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు అమరేందర్, నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి లోడె లింగస్వామి, మండల కార్యదర్శులు, శ్రీనివాస్, మహేష్ నాయకులు, రైతన్నలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిని మందులతో నివారించవచ్చు

వైద్యాధికారి, డాక్టర్ లింగమూర్తి

తుంగతుర్తి నవంబర్ 13 (జనంసాక్షి)



కుష్ఠు వ్యాధి అంటువ్యాధి కాదని అంటువ్యాధి కాదని దాన్ని పూర్తిగా మందులతో నయం చేయవచ్చని రావులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ లింగమూర్తి అన్నారు, శుక్రవారం జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలో 44 మంది అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహించారు, దీనిలో రావులపల్లి పీహెచ్‌సీ పరిధిలో ఇద్దరు కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు జరిగిందన్నారు, గుర్తించిన 44 మంది అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహించి, తదుపరి నిర్ధారణ కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రత్యేక వైద్య శిబిరంలో అనుమానితులకు పరీక్షలు నిర్వహించగా, నలుగురికి కుష్ఠు వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ కావడం జరిగింది అని తెలిపారు. కుష్ఠు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, వైద్యుల సూచనల మేరకు పూర్తిస్థాయి చికిత్స తీసుకుంటే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని, తద్వారా శారీరక వైకల్యాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో కుష్ఠు వ్యాధికి ఉచితంగా పరీక్షలు మరియు చికిత్స అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ వ్యాధి పట్ల ప్రజలు ఎలాంటి అపోహలు, వివక్షకు తావివ్వకుండా, చర్మంపై స్పర్శ జ్ఞానం లేని మచ్చలు, చేతులు మరియు కాళ్లలో తిమ్మిర్లు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రజలందరూ ఆరోగ్య సిబ్బందికి సహకరిస్తూ కుష్ఠు వ్యాధి రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని డాక్టర్ లింగమూర్తి గారు కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ శ్రీ సురేష్ కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రావులపల్లి లెప్రసీ నోడల్ పర్సన్ గాజుల సోమన్న, ఆశా కార్యకర్తలు మరియు ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొని వైద్య శిబిరం నిర్వహణలో సహకరించారు.

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి • నల్గొండలో కొత్తగా మంజూరైన చేయూత పెన్షన్ల పంపిణీ

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 13,(జనం సాక్షి):

పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఏచూరి గార్డెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన చేయూత పెన్షన్ల ఉత్తర్వులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్గొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో మామిళ్లగూడెం వద్ద ఇందిరమ్మ టవర్స్ నిర్మించి పేదలకు 480 ఇళ్లను అందించనున్నట్లు వెల్లడించారు. పార్టీలకతీతంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, ఇళ్లు లేని వారందరికీ విడతలవారీగా ఇళ్లు అందిస్తామని తెలిపారు.రాబోయే రోజుల్లో పెన్షన్ మొత్తాన్ని రూ.4,000కు పెంచే అవకాశం ఉందని, దీనిపై ముఖ్యమంత్రి స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉందని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం పెన్షన్లు అందని వారు నిరాశ చెందకుండా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పేదలకు పెన్షన్లు ఆర్థిక భరోసా

నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పెన్షన్లు పేదలకు ఆర్థిక భరోసాతో పాటు ఆత్మగౌరవాన్ని కల్పిస్తాయని అన్నారు. నల్గొండ కార్పొరేషన్ పరిధిలో కొత్త పెన్షన్ల కోసం 2,430 దరఖాస్తులు రాగా, వాటిలో 2,036 దరఖాస్తులు అర్హత సాధించాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు.ఎమ్మెల్సీ శంకర్ నాయక్





మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం చేయూత పెన్షన్లను మంజూరు చేస్తోందని, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 40 లక్షల మందికి పెన్షన్లు అందిస్తూ సామాజిక భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి కొత్తగా మంజూరైన పెన్షన్ల నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కానుందని వెల్లడించారు.

జిల్లాలో 27,255 మందికి కొత్త పెన్షన్లు:

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో ప్రతినెలా 1,97,262 మందికి పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తాజాగా జిల్లాలో మరో 27,255 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరయ్యాయని వెల్లడించారు. నల్గొండ నియోజకవర్గానికి 4,259 కొత్త పెన్షన్లు మంజూరైనట్లు పేర్కొన్నారు.ఐదు కేటగిరీల్లో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి అర్హులను గుర్తించినట్లు తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి నెలకు రూ.2,016 చొప్పున పెన్షన్ నగదు వారి ఖాతాల్లో జమ అవుతుందని చెప్పారు. కొత్తగా పెన్షన్ పొందని అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆఫీజ్ ఖాన్, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కార్పొరేటర్లు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు ఉత్తర్వులను అందజేశారు.

మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

వలిగొండ, నవంబర్ 13 (జనంసాక్షి) : వెంకటాపురం శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న స్వామివారి బ్రహ్మోత్సవాలకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా బ్రహ్మోత్సవాల కరపత్రాలు, ఆహ్వాన పత్రికలు, గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ విషయాన్ని దేవస్థాన కార్యనిర్వహణాధికారి కొత్వాలి వెంకటయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ తుమ్మల కృష్ణవాస్, ధర్మకర్తలు తుమ్మల కరుణాకర్ రెడ్డి, దామెర అనంతాచారి, కంబాలపల్లి అండాలు, కొత్త జంగయ్య, ఆవుల చంద్రకళ, రాధారపు రమేష్, భట్టు నర్సింహ, మీసాల ముత్యాలు, కేశిరెడ్డి నరేందర్ రెడ్డి, కూర వెంకటేశం, ఎస్. నర్సింహ, బుర్రల కుమార్ గౌడ్, బోడిగే వెంకటేశం, ఎక్స్ ఆఫీషియో సభ్యుడు ప్రతాపురం కృష్ణశాస్త్రులు, దేవస్థాన అర్చకులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతల చేయూత

శ్రీరాంపురం ప్రాథమిక పాఠశాలకు స్మార్ట్ టీవీ అందజేత

తిరుమలగిరి (సాగర్) నవంబర్ 13 (జనంసాక్షి) : మండల పరిధిలోని శ్రీరాంపురం ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చారు. వజ్ర తేజ రైస్ ఇండస్ట్రీ డైరెక్టర్ చిట్టిప్రోలు వెంకటేశ్వర్లు పాఠశాలకు 43 అంగుళాల ఆండ్రాయిడ్ స్మార్ట్ టీవీని అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫరీద్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించేందుకు స్మార్ట్ టీవీ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందించిన చిట్టిప్రోలు వెంకటేశ్వర్లుకు ఉపాధ్యాయుల తరఫున, విద్యార్థుల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.విద్యారంగ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మల్లీశ్వరి, ఇమామ్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి మండల కేంద్రంలో వాహన రిజిస్ట్రేషన్ కార్యాలయం

ప్రజలకు వాహనదారులకు ఇక ఇబ్బందులు తప్పినట్లే

ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

కొండమల్లేపల్లి, నవంబర్ 13 (జనంసాక్షి) : కొండమల్లేపల్లి మండల ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. మండల కేంద్రంలో వాహన రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు కానుంది. దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ చొరవతో ఈ కార్యాలయం మంజూరు అయినట్లు సమాచారం. ప్రజల ప్రయాణ భారాన్ని తగ్గించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కొండమల్లేపల్లి పట్టణంలో ప్రస్తుత తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా మోటార్ వెహికల్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే బాలు నాయక్ స్వయంగా తెలిపారు. దీంతో నియోజకవర్గ ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు స్థానికంగానే అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటి వరకు దేవరకొండ నియోజకవర్గ గ్రామాల ప్రజలు వాహన రిజిస్ట్రేషన్, లైసెన్స్, ఇతర రవాణా పనుల కోసం మిర్యాలగూడ, నల్గొండ లేదా హైదరాబాద్ వరకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో సమయం, డబ్బు వృథా అవడంతో పాటు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కొత్తగా ఏర్పాటు కానున్న ఈ కార్యాలయం వల్ల కొండమల్లేపల్లి మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల ప్రజలకు కూడా ఎంతో ఉపయోగం కలుగనుంది. ఇక నుంచి వాహన రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, వాహన బదిలీ, ఫిట్ నెస్ వంటి సేవలన్నీ స్థానికంగానే అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యాలయం ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే బాలు నాయక్‌కు స్థానిక సర్పంచ్ పసునూరి యుగేంధర్ రెడ్డి, మండల ప్రజలు, వాహనదారులు, యువకులు కృతజ్ఞతలు తెలిపారు. మండల కేంద్రం అభివృద్ధిలో ఇది మరో ముందడుగు అని హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే ఈ కార్యాలయ ప్రారంభోత్సవ తేదీని అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.



రైతుల సౌకర్యార్థం రూ.10 లక్షలతో గ్రావెల్ రోడ్డు

రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ, నవంబర్ 13 (జనం సాక్షి) : దేవరకొండ పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి ఖిల్లా గుట్ట వెనుక భాగంలోని వ్యవసాయ భూములకు వెళ్లేందుకు ఎస్‌డీఎఫ్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన గ్రావెల్ రోడ్డును ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ శుక్రవారం ప్రారంభించారు. ఈ రోడ్డు అందుబాటులోకి రావడంతో రైతులకు వ్యవసాయ భూములకు రాకపోకలు సులభతరం అవుతాయని, ట్రాక్టర్లు, ఎరువులు, విత్తనాల రవాణాకు ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, రైతులు పాల్గొన్నారు.



చాడలో న్యాయ విజ్ఞాన సదస్సు

చట్టాలపై అవగాహన అవసరం..

ఉచిత న్యాయ సహాయం కోసం 15100 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలి : న్యాయవాది ఎస్. సాయి శ్రీనివాస్

మోటకొండూరు, నవంబరు 13(జనం సాక్షి): యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి అధ్యక్షులు మరియు కార్యదర్శి సూచనల మేరకు జాతీయ న్యాయ సేవల వారం రోజుల కార్యక్రమంలో భాగంగా మోటకొండూరు మండలంలోని చాడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయ సహాయ న్యాయవాది ఎస్. సాయి శ్రీనివాస్ పాల్గొని గ్రామ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులతో పాటు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు నిషేధమని, పిల్లలను



ముఖ్యంగా ఆడపిల్లలను బాగా చదివించాలని, వారిని పనికి వినియోగించడం లేదా చిన్నతనంలో వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. చట్టాలను ఉల్లంఘిస్తే శిక్షలు తప్పవని హెచ్చరించారు. అలాగే పిల్లలు అధికంగా మొబైల్ ఫోన్లు వినియోగిస్తే సైబర్ నేరగాళ్ల బారిన పడే ప్రమాదం ఉందని, తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే న్యాయ సేవా సంస్థలను ఆశ్రయించాలని, లేదా 15100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. గ్రామ ఉపసర్పంచ్ భూమయ్య, గ్రామ కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, చట్టప్రకారంగా నడుచుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ ఎం.డి. మౌలానా పాల్గొని గ్రామస్తులకు లీగల్ లిటరసీ కరపత్రాలను అందజేశారు.

హోంగార్డుల సంక్షేమానికి పోలీస్ శాఖ ఎల్లవేళలా కృషి

10 మంది హోంగార్డులకు రూ.3.43 లక్షల ఆర్థిక సహాయం చెక్కులు పంపిణీ చేసిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ ప్రతినిధి,నవంబర్ 13 (జనంసాక్షి): హోంగార్డుల సంక్షేమం, వారి కుటుంబాల ఆర్థిక భద్రతకు పోలీస్ శాఖ ఎల్లవేళలా ప్రాధాన్యతనిస్తూ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ తెలిపారు. పోలీస్ శాఖలో కీలక భాగస్వాములుగా ఉంటూ విధి నిర్వహణలో నిరంతరం సేవలందిస్తున్న హోంగార్డులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (హోంగార్డ్స్), హైదరాబాద్ వారి ఆమోదంతో సెంట్రల్ వెల్ఫేర్ ఫండ్ నుంచి నల్గొండ జిల్లాకు చెందిన 10 మంది హోంగార్డులకు మొత్తం రూ.3,43,000 ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.వివిధ సంక్షేమ ప్రయోజనాల కింద ఇద్దరు హోంగార్డులకు వైద్య చికిత్స కోసం రూ.20 వేలు, ఇద్దరు హోంగార్డుల పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌ల కింద రూ.3 వేలు, మరణించిన నలుగురు హోంగార్డుల







కుటుంబాలకు డెత్ బెనిఫిట్ కింద రూ.60 వేలు, పదవీ విరమణ చేసిన ఇద్దరు హోంగార్డులకు రిటైర్మెంట్ ప్రయోజనాల కింద రూ.2.60 లక్షలు మంజూరు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. హోంగార్డులు శాంతిభద్రతల పరిరక్షణ, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ తదితర విధుల్లో పోలీసులతో కలిసి నిరంతరం సేవలందిస్తున్నారని తెలిపారు. వారి సేవలను గుర్తించి, ఆపద సమయంలో వారికి, వారి కుటుంబాలకు అండగా నిలవడం పోలీస్ శాఖ బాధ్యత అని పేర్కొన్నారు. హోంగార్డుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని అర్హులకు సకాలంలో అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.హోంగార్డులు విధులను అంకితభావంతో, క్రమశిక్షణతో నిర్వహిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ కళ్యాణ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా నల్గొండను తీర్చిదిద్దాలి

పిల్లల భద్రత, భవిష్యత్తు సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత : జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 13,(జనం సాక్షి) : నల్గొండ జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. పిల్లలే దేశ భవిష్యత్తు అని, విద్యార్థులను మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉంచి మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఎన్‌కార్డ్ సమావేశంలో జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని పాఠశాలలు, హాస్టళ్ల పరిసర ప్రాంతాల్లో గంజాయి, మద్యం, సిగరెట్లు, గుట్కా వంటి మత్తు పదార్థాల విక్రయాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థుల్లో ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడ్డారా అనే విషయాన్ని గుర్తించి, అవసరమైన వారికి నిపుణులైన కౌన్సిలర్ల ద్వారా కౌన్సెలింగ్ ఇప్పించాలని సూచించారు. పాఠశాలల పరిధిలో గుట్కా, పాన్, సిగరెట్లు విక్రయించే దుకాణాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.నిడమనూరు స్కావెంజర్ హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొన్న ఇబ్బందుల నేపథ్యంలో



బాలికల హాస్టళ్లలో పూర్తిగా మహిళా సిబ్బందినే నియమించాలని, పురుష సిబ్బందికి అవకాశం కల్పించకూడదని ఆదేశించారు. పెద్దవూర బాలుర హాస్టల్‌లో జరిగిన ఘటనపై సంబంధిత జిల్లా అధికారి (డీటీడబ్ల్యూఓ) ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు.దేవరకొండ ప్రాంతంలో అక్రమ మద్యం విక్రయాలపై పలు కేసులు నమోదవుతున్న నేపథ్యంలో కిరాణా దుకాణాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తూ మద్యం విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దుకాణాలను గుర్తించి వెంటనే మూసివేయాలని, అవసరమైతే సీజ్ చేయాలని స్పష్టం చేశారు.10 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు యోగా నేర్పించడం ద్వారా మానసిక స్థైర్యం, క్రమశిక్షణ, మంచి ఆలోచనా విధానాన్ని పెంపొందించాలని కలెక్టర్ సూచించారు. జువెనైల్ క్రైమ్‌లు, మైనర్ గ్యాంగ్ కేసులు నమోదవుతుండటం ఆందోళనకరమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్, జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.







జిల్లా ఆర్టీఐ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా బైరు సైదులు గౌడ్ నియామకం

నల్లగొండ, నవంబర్ 13 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ఆదేశాల మేరకు నల్గొండ జిల్లా ఆర్టీఐ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నల్గొండ పట్టణానికి చెందిన బైరు సైదులు గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ నియామక ఉత్తర్వులు జారీ చేయగా, కలెక్టర్ చేతుల మీదుగా బైరు సైదులు గౌడ్ నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో సమాచార హక్కు చట్టం-2005 సమర్థవంతంగా అమలయ్యేలా కమిటీ సభ్యుడు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులకు చట్టంపై అవగాహన కల్పించడంతో పాటు, సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకునే పౌరులకు తగిన సహాయ సహకారాలు అందించాలని తెలిపారు.గత పదేళ్లుగా సమాచార హక్కు వికాస సమితి ఆధ్వర్యంలో నల్గొండ జిల్లాలో సమాచార హక్కు చట్టంపై చేసిన సేవలు, కృషిని గుర్తించి తనకు ఈ బాధ్యత అప్పగించినందుకు జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్, ఆర్డీఓ అశోక్ రెడ్డికి బైరు సైదులు గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వ అధికారులకు, సామాన్య ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సమాచార హక్కు చట్టం సమర్థవంతమైన అమలుకు నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.తన నియామకానికి సహకరించిన సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ యర్రమాద కృష్ణారెడ్డి, మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కాచం సత్యనారాయణ, దయాకర్ రావు, మారం గోనారెడ్డి, కోటగిరి దైవాధీనం, గందమళ్ల జయంత్, గాదె వినోద్ రెడ్డి, యర్రమాద హేమలత, బోగరి రామకృష్ణ, యాళ్ల చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్రం శ్రీనివాస్‌తో పాటు జిల్లా కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సమాచార హక్కు వికాస సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్రం శ్రీనివాస్, కర్నాటి యాదగిరి, కార్యదర్శి తుంగతుర్తి రామకృష్ణ, గంటేకంపు గణేష్, బీమనపల్లి నగేష్, అదిమల్ల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాల పంపిణీ

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం : జటావత్ లాలు



తిరుమలగిరి (సాగర్) నవంబర్ 13, (జనంసాక్షి) : మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. తిరుసాగ రైతు ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌లో సభ్యత్వం కలిగిన రైతులకు ఒక్కొక్కరికి 20 కిలోల వేరుశనగ విత్తనాల బస్తాలను అందజేశారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జటావత్ లాలు నాయక్ ముఖ్య అతిథిగా హాజరై రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం ద్వారా సాగుకు ప్రోత్సాహం లభిస్తుందని, రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏడి సరిత, మండల వ్యవసాయ అధికారి ఘంటా హర్షిత, నాంపల్లి సైదులు ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ



నడిగూడెం (జనంసాక్షి) : ఈనెల 15వ తారీకు నల్లగొండ పట్టణంలో అఖిలభారత రైతు సంఘం బహిరంగ సభను జయప్రదం చేయాలని మండలంలో ప్రచారం నిర్వహిస్తూ గ్రామపంచాయతీ సిబ్బందితో మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా వారు అనేక సమస్యలను తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బంది న్యాయమైన కోరికలని ప్రభుత్వం పరిష్కరించాలని పంచాయతీ సిబ్బందిని పర్మిట్ చేయాలని ,పి ఆర్ సి పరిధిలోకి తీసుకువచ్చి కనీస వేతనం 30 వేల రూపాయలు పెంచాలని, డీఏ వర్తింప చేయాలని, జీవో నెంబర్ 51 సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని, కారోబర్ బిల్లు కలెక్టరును సహాయ కార్యదర్శిగా నియమించాలని, గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు నేరుగా సిబ్బంది వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని కార్మికులను అక్రమంగా తొలగిస్తున్న సర్పంచ్ ల పై చర్యలు తీసుకోవాలని బెల్లంకొండ సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాది డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంపత్ పిచ్చయ్య, తిరపయ్య, నాగభూషణం వెంకన్న గురవయ్య పాల్గొన్నారు.